ఉత్సాహంగా 'హర్ ఘర్ తిరంగా'

- జిల్లాలో పలు చోట్ల జాతీయ జెండా ఆవిష్కరణ
- ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేయాలని నాయకుల సూచన

చేవెళ్ల టౌన్ : ఎమ్మెల్యే యాదయ్యకు జాతీయ జెండాను అందజేస్తున్న సికింద్రాబాద్ డివిజన్ పోస్టల్ అధికారులు

ఇబ్రహీంపట్నంరూరల్ : జాతీయ జెండా ఎగురవేసిన నిట్టు శ్రీశైలం

ఇబ్రహీంపట్నం బీజేవైఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్న తిరంగా యాత్ర

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు మంగళవారం పలువురు యువకులు, బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహించారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి మూడు రంగుల జెండాలు చేతబూని నాగార్జునసాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడంతోపాటు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర నాయకుడు ప్రతాప్, నాయకులు నర్సింహా రెడ్డి, రమణారెడ్డి, బీజేవైఎం నాయకులు రవీందర్‌రెడ్డి, మహేందర్, సంతోష్, అనిల్, రాఘవేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం రూరల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇండ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని ఓబీసీ మోర్చా నాయకుడు నిట్టు శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని దండుమైలారంలో జెండాను ఆవిష్కరించారు.

చేవెళ్లటౌన్ : హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని అంతటా ఘనంగా జరుపుకోలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు యాదయ్యకు సికింద్రాబాద్ డివిజన్ పోస్టల్ అధికారులు జెండాను అందజేశారు.

ఆహ్వాన పత్రిక అందజేత

కొత్తూరు మునిసిపాలిటీలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి రావాలని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామ పెద్దలు - కొత్తూరు ఆగస్టు 13

రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయొద్దు

యూనియన్ బ్యాంక్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల రూరల్, ఆగస్టు 13 : రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయొద్దని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని యూనియన్ బ్యాంక్ వద్ద రోడ్లపై వాహనాల పార్కింగ్, తోపుడుబండ్ల నిర్వాహకులతో సీఐ వెంకటేశం మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యూటర్న్‌ల వద్ద వాహనదారులు వేగాన్ని అదుపులో ఉంచుకోవాలని, రోజువారీ వ్యాపారం చేసుకునే పండ్ల వ్యాపారులు రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలలో ఎన్నికల నిర్వహణ

తాళ్లపల్లి పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

షాబాద్, ఆగస్టు 13 : పాఠశాలలో ఎన్నికల నిర్వహణతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ స్టూడెంట్ లీడర్-2024 ఎలక్షన్స్ నిర్వహించారు. ఆయా తరగతులకు సంబంధించి విద్యార్థులు ఎన్నికల బరిలో నిలిచారు. విద్యార్థులందరూ తమ ఓటు హక్కును రహస్య బ్యాలెట్ పద్ధతిలో వినియోగించుకున్నారు. స్కూల్ స్థాయి మోడల్ ఎలక్షన్ ద్వారా ఎన్నికలు ఎలా ఉంటాయో విద్యార్థులు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, గ్లోరీ పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 13 : బంగ్లాదేశ్‌లో హిందువుల ఇండ్లు, వ్యాపార సముదాయాలు, శ్మశానవాటికలు దాడులకు గురవుతున్నాయని.. అదే విధంగా హిందువులకు భద్రత కల్పించాలంటూ నేడు బుధవారం హిందూ ఐక్య వేదిక షాద్‌నగర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ అధ్యక్షుడు బండా రమేశ్ తెలిపారు. నిరసన ర్యాలీని ఉదయం 10 గంటలకు షాద్‌గర్ రైల్వే స్టేషన్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి మండల రెవెన్యూ కార్యాలయం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చేవెళ్ల టౌన్ : బంగ్లాదేశ్‌లో భారతీయులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం ఉదయం 9 గంటలకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అఖిలపక్ష ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. వ్యాపార సంస్థలు (దుకాణాలు), విద్యాసంస్థలు మూసివేసి ర్యాలీకి సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 13 : షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి నెలా డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలున్నా డయల్ యువర్ డీఎం నం.9959226287కు ఫిర్యాదు చేయాలన్నారు.

రాగన్నగూడ అధ్యక్షుడిగా సామ భీంరెడ్డి

తుర్కయాంజాల్, ఆగస్టు 13 : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాగన్నగూడ అధ్యక్షుడిగా రాగన్నగూడాకు చెందిన సామ భీంరెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ పీఎస్‌టీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా సామ భీంరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

ఆమనగల్లు మున్సిపాలిటీ రజక సంఘం అధ్యక్షుడిగా బుచ్చయ్య

ఆమనగల్లు, ఆగస్టు 13 : ఆమనగల్లు మున్సిపాలిటీ రజక సంఘం అధ్యక్షుడిగా నాగిళ్ల బుచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మున్సిపాలిటీలోని ఓ కల్యాణ మండపంలో రజక సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగిళ్ల బుచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా నాగిళ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల తిరుపతయ్య, కోశాధికారిగా పాతకోట ఫకీరా, ప్రచార కార్యదర్శిగా నాగిళ్ల బాలయ్య, కార్యదర్శిగా నాగిళ్ల శ్రీను, ప్రధాన సలహాదారుగా నాగిళ్ల చందులను ఎన్నుకున్నారు. అనంతరం రజక సంఘం యువజన విభాగం అధ్యక్షుడిగా మద్దూరి ఆనంద్, ఉపాధ్యక్షులుగా మద్దూరి కుమార్, పాతకోట రాజు, ప్రధాన కార్యదర్శులుగా నాగిళ్ల రాజు, శేఖర్, కార్యదర్శిగా పర్వతాలు, ప్రధాన సలహాదారులుగా నాగిళ్ల సాయి, నాగిళ్ల జగన్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ చౌరస్తాలో రజకసంఘం జెండాను ఆవిష్కరించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా మెడికల్ క్యాంపులో పాల్గొన్న జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

చేవెళ్ల రూరల్, ఆగస్టు 13 : ప్రతి సంవత్సరం తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఇండియన్ క్యాన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో మండలంలోని 135 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ మాట్లాడుతూ.. 35 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని, గుట్కా నమలడం, ధూమపానాలకు దూరంగా ఉండాలని సూచించారు. నోటి క్యాన్సర్ లక్షణాలున్న 21 మందిని గుర్తించడం జరిగిందని, రొమ్ము క్యాన్సర్ లక్షణాలున్న ఒకరిని గుర్తించి క్యాన్సర్ దవాఖానకు రెఫర్ చేయడం జరిగిందన్నారు. సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్టు అధికారి రాకేశ్, డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

బస్సును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

మేడిపల్లి బస్సు పున:ప్రారంభం

యాచారం, ఆగస్టు13 : కరోనా సమయంలో నిలిపేసిన బస్సును పున:ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం నుంచి తాటిపర్తి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సును మంగళవారం మేడిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం నుంచి వయా మేడిపల్లి మీదుగా తాటిపర్తి వరకు అక్కడి నుంచి మీర్‌ఖాన్ పేట, ఇబ్రహీంపట్నం మీదుగా ఉప్పల్ రింగు రోడ్డు వరకు బస్సును ప్రారంభించారు. ఈ బస్సు ఉదయం 9:05కు తాటిపర్తి నుంచి వయా నానక్‌నగర్, మేడిపల్లి, యాచారం, కందుకూరు వరకు బస్సు నడువనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి

షాబాద్‌లోని తెలంగాణ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

షాబాద్, ఆగస్టు 13 : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం షాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె హాస్టల్‌లో ఉన్న బాలికలకు సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, డయేరియా, తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు.

కొండకల్ గ్రామస్తులకు రూ.5లక్షల ప్రమాద బీమా

చేవెళ్ల రూరల్, ఆగస్టు 13 : 18 నుంచి 65 సంవత్సరాల లోపు ఉన్న కొండకల్ గ్రామ ప్రజలకు సొంత డబ్బులతో రూ.5లక్షల ప్రమాద బీమా ఒక సంవత్సర పాటు చేయించడానికి నిర్ణయించుకున్నానని మాజీ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి అన్నారు. ఇన్సూరెన్స్ చేయించుకోవాలనుకునేవారు మీ ఆధార్, పాన్ కార్డుకు సంబంధించిన జిరాక్స్‌లను తీసుకొని గ్రామ పంచాయతీకి రావాలని కోరారు. ఆగస్టు 14 నుంచి 18 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్‌టౌన్,ఆగస్టు 13 : సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మున్సిపాలిటీలోని 14వ వార్డులో కొనసాగుతున్న నూతన సీసీ రోడ్డు పనులను మంగళవారం కౌన్సిలర్ బచ్చలి నర్సింహ, నాయకుడు శ్రీశైలంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పలు వార్డుల్లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. వీటికి స్థానికులు సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చేవెళ్ల టౌన్, ఆగస్టు 12 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని బస్టాండ్ సమీపంలో రోడ్డుకు దగ్గరగా కూరగాయలు, పండ్ల విక్రేతలకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలుగకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పండ్లు కూరగాయలు తీసుకోవడానికి వచ్చేవారిని ఎక్కువ సేపు నిల్చోపెట్టుకోవద్దన్నారు. వాహనాలను రోడ్డుపై పెట్టడంతో పాదచారులకు ఇబ్బంది కలుగుతున్నదని, రోడ్డుకి దగ్గరగా ఉన్న దుకాణాలను వెంటనే వెనక్కి జరపాలని సీఐ సూచించారు.

కూరగాయలు, పండ్ల విక్రేతలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

నంబర్ ప్లేట్లపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

చేవెళ్ల టౌన్, ఆగస్టు 13 : ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరని చేవెళ్ల ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్ కుమార్ తెలిపారు. మంగళవారం చేవెళ్లలో మోటర్ సైకిళ్లకు నంబర్ ప్లేట్స్, వాహనాదారులకు డ్రైవింగ్ లైసెన్సులు లేనివారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చేవెళ్ల పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి కావడంతో హెచ్చరించి వాహనాలను వదిలేయడం జరిగిందన్నారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాల యాజమానుల వివరాలు సేకరించడం జరిగిందని, ఇక నుంచి చేవెళ్ల పరిధిలో తనిఖీలు రోజూ ఉంటాయని వారు వెల్లడించారు. తనిఖీల్లో చేవెళ్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్

షాబాద్, ఆగస్టు 13 : దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందని చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం షాబాద్ మండలం సర్దార్‌నగర్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ అధ్యక్షుడిగా భానుప్రసాద్, కార్యదర్శిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా అఖిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెప్పారు.



ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్న డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి

- ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి
- రూ.19 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ఆదిబట్ల, ఆగస్టు 13 : ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీ పటేల్‌గూడ 13వ వార్డులో, కొంగరకలాన్ తండా 6వ వార్డులో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు పనులు, వర్షపు నీరు పోవడానికి పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చి జిల్లాలోని మునిసిపాలిటీని నంబర్‌వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాములు, నగేశ్ పాల్గొన్నారు.

రేగడి దోస్వాడ గ్రామంలో కంది పంటను పరిశీలిస్తున్న రత్నాకర్ తదితరులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్

షాబాద్, ఆగస్టు 13 : కందిపంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని రేగడి దోస్వాడ గ్రామంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు రెండు నెలల క్రితం కృషి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో షెడ్యూల్ కులాల ద్వారా తెలంగాణ కంది-3వ రకం విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మంగళవారం రైతులతో కలిసి కంది పంటను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన కంది పంటలో ఎరువుల యజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిపై రైతులు ఆసక్తి పెంచుకోవాలన్నారు.

అధ్యాపకులకు సన్మానం



మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేసిన అధ్యాపకులు బదిలీపై వెళ్లడంతో వారికి మంగళవారం కళాశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు - మంచాల, ఆగస్టు 13

చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద ప్రాథమిక ఉన్నత పాఠశాల సేవలందించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, స్థానిక నేతల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. - చేవెళ్ల రూరల్, ఆగస్టు 13